సాక్షి
నల్లగొండ
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



సిద్ధాంతానికి కట్టుబడిన నేత..
నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నేత సురవరం సుధాకర్‌రెడ్డి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది
కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**589.20** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**55,244** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**55,244** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**33,495** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**9,700** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**9,349** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**2,400** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

15 వరకు 'ఇగ్నో'లో ప్రవేశాలు



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రాజు

రామగిరి(నల్లగొండ) : ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)లో జూలై 2025 సెషన్‌కి సంబంధించిన వివిధ మాస్టర్, డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా ప్రోగ్రాముల దరఖాస్తులు చివరి తేదీ ఈ నెల 15 వరకు ఉందని ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజు బోల్లా తెలిపారు. బుధవారం నల్లగొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో జరిగిన ఇగ్నో అడ్మిషన్ల ప్రమోషనల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇగ్నో ప్రోగ్రాముల ద్వారా పలు ఉపాధి, విద్యా అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు www.ingnou.ac.in వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహారెడ్డి, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విజయలక్ష్మి

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ భిక్షపతి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎఫ్ఎల్ఎన్ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని విషయ పరిజ్ఞానాల్లో మెరుగుపరచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో వెంకటేశం, బి.హిమజ, డి.రాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీపీఆర్ వ్యాక్సినేషన్



జీవాలకు టీకాలు వేయిస్తున్న డాక్టర్ రమేష్

నల్లగొండ అగ్రికల్చర్ : గొర్రెలు, మేకల్లో సోకే పారుడు వ్యాధిని నివారించేందుకు చేపట్టిన పీపీఆర్ టీకాల కార్యక్రమం బుధవారంతో ముగిసింది. గత నెల 26 నుంచి జిల్లా పశు వైద్య సంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ చేశారు. ఇందుకోసం 54 బృందాలు రోజూ ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు మందల వద్దకు వ్యాక్సిన్ వేశాయి. జిల్లాలోని 12 లక్షల 50 వేల మేకలు, గొర్రెలకు టీకాలు పూర్తి చేసి నూటికి నూరు శాతం లక్ష్యం సాధించారు. జిల్లాలో పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సిబ్బందిని పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ జీవీ.రమేష్ అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

కేతేపల్లి : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. కేతేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఆరోగ్య కేంద్రంలో విధుల నిర్వహిస్తున్న, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న మందులు, వ్యాక్సిన్ నిల్వలు, ఇతర వైద్య పరికరాల వివరాలతో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, వైద్యాధికారులు అర్చన, దివ్య, సిబ్బంది రవీందర్, యాదయ్య, నిర్మల, శశిరేఖ తదితరులు ఉన్నారు.

వీరవనిత ఐలమ్మ

నల్లగొండ : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం నల్లగొండలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐలమ్మ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేషన్ కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, శ్రీనివాస్‌రెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎంవీ.గోనారెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు

'స్థానికం'.. సందిగ్ధం!

- సమీపిస్తున్న కోర్టు గడువు
- ఎన్నికలపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్లను ఖరారు చేసిన జిల్లా యంత్రాంగం
- ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఓటరు తుది జాబితా ప్రకటన
- గందరగోళంలో రాజకీయ పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయా? లేదా? అన్న గందరగోళం పార్టీ శ్రేణుల్లో మొదలైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓ వైపు జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అన్నీ సిద్ధం చేస్తోంది. ఇటు గ్రామ పంచాయతీ, అటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండింటిలో ఏ ఎన్నికలు నిర్వహించినా అందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. కోర్టు ఆదేశానుసారం ఈ నెల 30వ తేదీలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే 10వ తేదీ దాటిపోయింది. అయినా ఎన్నికలపై ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. ఎన్నికలు నిర్వహిస్తుందా లేక కోర్టుకు వెళ్లి ఎన్నికల నిర్వహణకు గడువు కోరుతుందా అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం

రాష్ట్రంలో ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించినా, లేదంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించినా రెండింటికీ జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఓటర్ల తుది జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను కూడా ప్రకటించిన విషయం తెలిసిందే.



కట్టంగూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు తుది జాబితా విడుదల చేస్తున్న అధికారులు

బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బాక్సులు, ఇతర సామగ్రిని తెప్పించి సిద్ధం చేసింది.

- నల్లగొండ జిల్లాలో 869 గ్రామ పంచాయతీలు ఉండగా, 10,73,506 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చింది. ఎన్నికల నిర్వహణ కోసం 7,494 పోలింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేసింది.
- సూర్యాపేట జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు ఉండగా, 6,94,815 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్కలు తేల్చింది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం 4,403 పోలింగ్ కేంద్రాలను కూడా ఖరారు చేసింది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు తుది జాబితా విడుదల..

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కూడా జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. జిల్లా పరిషత్ అధికారులు ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల జాబితాను కూడా విడుదల చేశారు. ఈనెల 6వ తేదీన ముసాయిదా జాబితా విడుదల చేసి వాటిపై అభ్యంతరాలు స్వీకరించి బుధవారం ఓటర్ల తుది జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల చేశారు. నల్లగొండ జిల్లాలో గ్రామ పంచాయతీ ఓటర్ల తుది జాబితాను తీసుకొని, దానిని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల జాబితాగా ఖరారు చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కూడా ఇప్పటికే బ్యాలెట్ పేపర్‌తో పాటు పోలింగ్ సామగ్రిని కొని సిద్ధం చేశారు.

- నల్లగొండ జిల్లాలో 33 జెడ్పీటీసీలు ఉండగా 353 ఎంపీటీసీ నియోజక వర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,957 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.
- సూర్యాపేట జిల్లాలో 23 జెడ్పీటీసీలు, 235 ఎంపీటీసీలు స్థానాలు ఉండగా, వాటి పరిధిలో 1272 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆశావహులకు తప్పని ఎదురుచూపు

ప్రభుత్వం ఎన్నికల విషయంలో ఎటూ తేల్చకపోవడంతో పార్టీ శ్రేణులు గందరగోళంలో పడ్డాయి. ఎన్నికలు వస్తాయని ఇప్పటికే గ్రామాల్లో ఇప్పటికే ఆశావహులు ముందస్తు పెట్టుబడితో ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు కార్యక్రమాలను చేపట్టారు. ఈనెల 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలంటే ఇప్పటికే షెడ్యూల్ విడుదల కావాలి. కానీ ఇంతవరకు రాలేదు. దీంతో రాజకీయ పార్టీ శ్రేణులు గందరగోళంలో పడ్డాయి. అసలు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా లేక కొంత గడువు కోరుతుందా అనే విషయం స్పష్టం చేయడంలేదు. ప్రస్తుత పరిస్థితి బట్టి చూస్తే ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనపడటం లేదని అధికార పార్టీకి చెందిన నేతలు కూడా భావిస్తుండటం గమనార్హం.

గవర్నర్ పర్యటనకు సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఎంజీయూలో ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవానికి ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆమె మహాత్మా గాంధీ యూనివర్సిటీని సందర్శించారు. గవర్నర్ పాల్గొనే స్నాతకోత్సవ వేదికను పరిశీలించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ రాక సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి బాధ్యతల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. అధికారులు ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని ఆయా అంశాలను అందులో పర్యవేక్షించాలన్నారు. ఈనెల 15న ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ టీం, 108, 104, ప్రత్యేక డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేయాలని, వేదిక వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాట్లు చూడాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ గవర్నర్ వస్తున్న సందర్భంగా యూనివర్సిటీలో పూర్తిస్థాయి భద్రతా ఏర్పాటు చేస్తామని, తనిఖీలు ఉంటాయని, గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే ఆ రోజు లోపలికి అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే వారి జాబితా ముందుగానే ఇవ్వాలని కోరారు. వైస్ ఛాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ స్నాతకోత్సవం సవ్యంగా జరిగేందుకు 12 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, ట్రాన్స్‌కో డీఈ నదీంఅహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంజీయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్

చిట్టడవులను తలపించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాల : రసాయన పరిశ్రమల యజమాన్యాలు పర్యావరణ పరిరక్షణకుగాను తమకు అందుబాటులో ఉన్న భూముల్లో మియావాకి తరహాలో చిట్టడవుల పెంపకం చేపట్టి అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని దశమి ల్యాబ్స్ రసాయన పరిశ్రమలో బుధవారం నిర్వహించిన వనమహోత్సవంలో కలెక్టర్ పాల్గొని మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడంతోపాటు వాటికి నీటిని అందజేసి సంరక్షించాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయ తనిఖీ..

చిట్యాలలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై వచ్చిన ధరఖాస్తులు, రికార్డులు, పీఓబీ భూములకు సంబంధించిన కేసులను ఆమె పరిశీలించారు.



పెద్దకాపర్తిలో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కార్యక్రమాల్లో ఆర్డీఓ వై.అశోకొరెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్, పీఓబీ ఈఈ వెంకన్న, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జానయ్య, తహసీల్దార్ కృష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు ఇస్తాం

నల్లగొండ అగ్రికల్చర్ : నాబార్డు ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం డీసీసీబీలో నిర్వహించి నాబార్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 వేలకుపైగా కొత్త సంఘాలు ఉన్నాయని కొన్ని గ్రూప్‌లకు రుణాలు ఇచ్చేందుకు తమ బ్యాంకు సిద్ధంగా ఉందని తెలిపారు. డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త గ్రూపులకు సహకార బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తే సంఘాల్లోని మహిళలతోపాటు బ్యాంకు అభివృద్ధి చెందుతుందన్నారు. నాబార్డు సీజీఎం ఉదయ భాస్కర్ మాట్లాడుతూ నాబార్డు ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాల వివరాలను వివరించారు. ఆప్కాబ్ జీఎం అశ్విని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కోఆపరేటివ్ బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ శంకర్‌రావు, జీఎం నర్మద, బ్యాంకు మేనేజర్లు, నాబార్డు అధికారులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

13న కుక్కలకు వ్యాక్సినేషన్

నల్లగొండ : కుక్కలకు ఈ నెల 13న వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్‌తో కలిసి ఆయన రామగిరి మున్సిపల్ పార్కును సందర్శించి వ్యాక్సినేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో కుక్కల దత్తత, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వీధి కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించేందుకుగాను చర్యలు చేపట్టామన్నారు. 13వ తేదీన జరిగే కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరు కానున్నట్లు తెలిపారు.



వ్యాక్సినేషన్ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

కవి బైరెడ్డికి కీర్తి పురస్కారం

రామగిరి(నల్లగొండ): నల్లగొండకు చెందిన ప్రముఖ కవి బైరెడ్డి కృష్ణారెడ్డికి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2024 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారం ప్రకటించింది. బైరెడ్డి కృష్ణారెడ్డి.. ఐదు కవిత్వ సంపుటాలను వెలువరించారు. మానవీయ బంధాలు, ఆర్ద్రత కలిగిన కవిత్వం రాసే బైరెడ్డి కృష్ణారెడ్డికి ఆర్ద్ర కవి అని పేరు. ప్రతిష్టాత్మకమైన కీర్తి పురస్కారం రావడంపై బైరెడ్డి కృష్ణారెడ్డిని నల్లగొండకు చెందిన సాహితీవేత్తలు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, లింగమూర్తి, డాక్టర్ మల్లికార్జునచారి, బుచ్చిరెడ్డి, దాసోజు శ్రీనివాస్, యర్ర దేవదానం అభినందించారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

శాలిగౌరారం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగవంతం చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం శాలిగౌరారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ శాఖలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించాలన్నారు. అనంతరం శాలిగౌరారం, వల్లాల గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఏపీఓ జంగమ్మ, ఏఈ భరత్ ఉన్నారు.

యూరియా ఇవ్వరూ..!



మాడ్గులపల్లిలో అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



చింతపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం భారీగా తరలివచ్చిన రైతులు

దరఖాస్తుల స్వీకరణతోనే సరి!

యాంత్రీకరణ పథకం అమలుపై దృష్టిపెట్టని ప్రభుత్వం

- 2024-25 సంవత్సరానికి రూ.3.17 కోట్ల నిధులు కేటాయింపు
- ఇప్పటి వరకు ట్రెజరీలో జమకాని నిధులు
- వచ్చిన అర్జీలనూ పరిశీలించని యంత్రాంగం
- వ్యవసాయ పనిముట్ల కోసం రైతుల ఎదురుచూపు

నల్లగొండ అగ్రికల్చర్: వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,400 దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ప్రభుత్వం కానీ, వ్యవసాయ శాఖ కానీ వాటిని పరిశీలించిన పాపాన పోలేదు. దీంతో పథకం అమలు జాప్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా వివిధ యంత్ర పరికరాల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

నిలిపివేసిన పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం

బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో నిలిపివేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రైతులకు 2024 మార్చి చివరి నాటికే యంత్ర పరికరాలు పంపిణీ చేయనున్నట్లు తొలుత ప్రభుత్వం పేర్కొంది. ఈ పథకం కింద 2024 సంవత్సరానికి గాను రూ.1.81 కోట్లు నిధులను కేటాయించింది. మార్చి 31 నాటికి పరికరాలను గ్రౌండింగ్ చేయాలని ఆదేశాలను జారీ చేసింది. కానీ, గత ఆర్థిక సంవత్సరంలో పైసా కూడా విడుదల చేయలేదు.

నిధులు విడుదల చేస్తూ జీఓ విడుదల

తిరిగి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను యాంత్రీకరణ పథకానికి ప్రభుత్వం రూ.3.17 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు జూలై చివరిలో రాష్ట్ర ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పరికరాల కోసం ఆగస్టు 5 నుంచి 15 వరకు దరఖాస్తులను స్వీకరించాలని షెడ్యూల్ విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరీకి చెందిన రైతులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలు అందించేలా జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఆగస్టు 16 నుంచి 20 వరకు దరఖాస్తులను పరిశీలించి 21 నుంచి 27 వరకు ఎంపికైన రైతుల నుంచి సబ్సిడీ పోను పెట్టుబడి రూపంలో డీడీలను తీసుకోవాలని భావించింది. అనంతరం ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు సబ్సిడీ పరికరాలను మంజూరు ఉత్తర్వులను అందజేసి అక్టోబర్ చివరి వారంలో లబ్ధిదారులకు పరికరాలను అందజేసేలా జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికను సిద్ధం చేసుకున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు.



నేటికీ నిధులు జమరాలే..

రాష్ట్ర ప్రభుత్వం రూ.3.17 కోట్లు యాంత్రీకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందే తప్ప నేటి వరకు ట్రెజరీలో నిధులను జమ చేయలేదు. అయితే ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,400 దరఖాస్తులను వ్యవసాయ శాఖ తీసుకుంది. మండల స్థాయిలోనే స్క్రూట్నీ చేసి జిల్లా కమిటీకి పంపించాలని మండల కమిటీలకు సూచించింది. కానీ, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా యూరియా ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్న దృష్ట్యా అటు రాష్ట్ర ప్రభుత్వం కాని, ఇటు వ్యవసాయ శాఖ కాని దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడింది. యూరియా ఇబ్బందులు తొలగిన తర్వాతనే దరఖాస్తుల పరిశీలనపై దృష్టి సారించనున్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంటుంది.

కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక..

అర్హులైన రైతుల నుంచి గ్రామ స్థాయిలోనే ఏఈఓలు దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను ఏఓల ఆధ్వర్యంలో ఉన్న కమిటీ పరిశీలించి తుది జాబితాను జిల్లా వ్యవసాయ అధికారికి పంపించనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాను కలెక్టర్ అనుమతితో ప్రకటించనున్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

వ్యవసాయ యాంత్రీకరణ కోసం రైతులు గ్రామ స్థాయిలో ఏఈఓలకు దరఖాస్తులు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. అక్టోబర్ చివరి నాటికి పరికరాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం యూరియా ఇబ్బందులు ఉన్న కారణంగా లబ్ధిదారుల ఎంపికలో జాప్యం నెలకొంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మహిళలు, యువతులతో కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్. సుగంధి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి సరైన మార్కెటింగ్ చేయడం ద్వారా మహిళలు, యువతులు స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. అదేవిధంగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు తదితర చిరుధాన్యాలలో ఉండే పోషక విలువల గురించి వివరించడంతో పాటు వాటితో బిస్కెట్స్, కేక్, లడ్డూలు, మురుకులు తయారీ చేసే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, సీహెచ్. నరేష్, డి. ఆదర్శ్, పి. అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



విజయలక్ష్మి

నూతనకల్: నూతనకల్ మండలం పెదనెమిల జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ తోట విజయలక్ష్మి ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో పాల్గొని మహిళా విభాగంలో మొదటి స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి. శివయ్య బుధవారం తెలిపారు. విజయలక్ష్మి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు చవగాని వెంకయ్య, హరికృష్ణ, ఉమారాణి, షమీమ్, సుల్తాన్, ప్రశాంతి తదితరులు అభినందించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

చిట్యాల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చిట్యాల పట్టణంలో బుధవారం జరిగింది. చిట్యాల పట్టణానికి చెందిన యానాల మోహన్‌రెడ్డి కుమార్తె సంతోష(37)కు సంస్థాన్ నారాయణపురం మండలం చిందోనిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు సంతానం. కొంతకాలంగా సంతోష ఏడవ తరగతి చదువుతున్న తన కుమారుడితో పాటు తల్లిదండ్రులతో కలిసి చిట్యాలలో ఉంటోంది. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఆమె తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

సిద్ధాంతానికి కట్టుబడిన నేత.. సురవరం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు

నల్లగొండ టౌన్: నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి చివరి వరకు కమ్యూనిస్టుగానే కొనసాగిన నేత సురవరం సుధాకర్‌రెడ్డి అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జీఎల్ గార్డెన్స్‌లో సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిసి సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సురవరం సుధాకర్‌రెడ్డి నల్లగొండ ఎంపీగా పనిచేశారని, పార్లమెంట్‌లో కార్మికులు, రైతుల సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. ఆయన ఎంపీగా పనిచేసిన సమయంలో నల్లగొండలో ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కమ్యూనిస్టులు లేవనెత్తే ప్రజా సమస్యలను పరిష్కరించేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. కామ్రేడ్ అంటే వంద మందితో సమానమని.. ఒక్కడున్నా ఎర్రజెండాతో అన్యాయాన్ని ప్రశ్నిస్తాడని గుర్తుచేశారు. కమ్యూనిస్టులంటే తనకు గౌరవమని మంత్రి తెలిపారు.

సుధాకర్‌రెడ్డి బతికున్నంత కాలం ప్రజల కోసం పనిచేసి, చనిపోయిన తర్వాత కూడా వైద్య విద్యార్థుల కోసం తన భౌతికకాయాన్ని ఇవ్వాలని కోరుకున్న గొప్ప నాయకుడని అన్నారు. సుధాకర్‌రెడ్డి విగ్రహాన్ని నల్లగొండలో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాతో పాటు దేశ ప్రజల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించిన ప్రజా ఉద్యమ నాయకుడు సురవరం అని కొనియాడారు. సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశనుంచే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడై వివిధ హోదాల్లో పనిచేసి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. జిల్లా నుంచి రెండుసార్లు ఎంపీగా పనిచేశారని గుర్తుచేశారు. తామిద్దరం వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసినా వ్యక్తిగత విమర్శలు చేసుకోలేదన్నారు. ఫ్లోరైడ్ ప్రాంతానికి తాగు, సాగునీరు సాధించేందుకు కమ్యూనిస్టులు చేసిన పోరాటానికి తాను సంఘీభావం తెలిపానని చెప్పారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రక ఉద్యమ విజయాలను చవిచూసిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. కమ్యూనిస్టులు మృతిచెందినా ప్రజల మధ్యలో జీవిస్తారని అదే కోవలోకి సురవరం వస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నాయకులు పల్లా నర్సింహారెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పల్లా దేవేందర్‌రెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, కలకొండ కాంతయ్య, శ్రీనివాస్, పల్లె నర్సింహ, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, హాశం, పబ్బు వీరస్వామి, రామచంద్రం, వెంకటేశ్వర్లు, నర్సింహ, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ-ఫార్ములా కాదు.. యూరియా ఫార్ములా ఏందో చెప్పాలన్నారు. హైకోర్టు ఆర్డర్‌తో గ్రూప్-1 ఫార్ములా తేలిపోయిందన్నారు. రెండేళ్లుగా ఇచ్చిన హామీలు పక్కన పెట్టి రకరకాల సమస్యలు సృష్టిస్తున్నారని.. కరెంట్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రతీది అబద్ధం అని తేలిపోయిందని పేర్కొన్నారు. గ్రూప్-1 విషయంలో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు బయటపడడంతో.. ఈ ఫార్ములాపై కేసు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారన్నారు. అసలు కేసులు పెట్టాల్సి వస్తే ఈ రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ పాలకులను వంద సార్లు జైలులో పెట్టొచ్చన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు ఎట్లా శాపనార్థాలు పెడుతున్నారో.. యువత ఎంత కోపంగా ఉన్నారో చూస్తున్నామన్నారు. హాస్టళ్లలో విషాహారం తిని చనిపోయిన విద్యార్థుల ఆత్మలు ఘోషిస్తున్నాయన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని హితవు పలికారు. కేసీఆర్‌ను తిట్టడం, కేసులు పెడతామనే చిల్లర మాటలను సీఎం రేవంత్‌రెడ్డి బంద్ చేయాలన్నారు. రైతులు ఒక పక్క యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని, వాళ్ల దృష్టిలో రేవంత్‌రెడ్డి ఎప్పటికీ ద్రోహిగానే మిగిలిపోతాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. కేసును సీబీఐకి అప్పగించడంతోనే ప్రధాని నరేంద్ర మోదీతో రేవంత్‌రెడ్డి బంధం బహిరంగమైందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలను ఏమార్చడం ఎవరికీ సాధ్యం కాదని అన్నారు.

భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భర్త



పానుగోతు సందీప్

మిర్యాలగూడ టౌన్: భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. బుధవారం మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం లచ్చతండా గ్రామానికి చెందిన పానుగోతు సందీప్ కుటుంబంతో కలిసి గత నాలుగేళ్లుగా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌లో నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా సందీప్‌కు మానసికస్థితి సరిగా ఉండటంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 8న అతడు భార్య పద్మతో గొడవపడి మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నివాసముంటున్న తన బావమరిది నేనావత్ గోవింద్ ఇంటికి వెళ్లాడు. సందీప్ చిన్న కుమారుడు మహేష్ వరంగల్‌లో చదువుతుండగా.. అతడి వద్దకు వెళ్తానని చెప్పడంతో సందీప్‌ను అతడి బావమరిది గోవింద్ మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో దింపాడు. అనంతరం సందీప్‌కు కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎంత వెతికినా సందీప్ ఆచూకీ లభించకపోవడంతో అతడి తమ్ముడు పానుగోతు మేఘా బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశుభ్రత లోపిస్తే ఉపేక్షించేది లేదు

- యాదగిరిగుట్ట ఆలయ ఈఓ వెంకట్రావ్



పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత లోపిస్తే ఉపేక్షించేది లేదని ఆలయ ఈఓ వెంకట్రావ్ అన్నారు. యాదగిరి కొండపైన బుధవారం ఆలయ పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ఏజెన్సీ కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామివారి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నిబంధనల ప్రకారం సిబ్బంది ఏర్పాటు, సిబ్బంది పనితీరు, నాణ్యమైన మెటీరియల్ సరఫరా అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. పరిశుభ్రత విభాగంలో పనిచేసే సిబ్బంది, సూపర్‌వైజర్లు, క్లీనింగ్ సిబ్బంది విధిగా అటెండెన్స్, వర్క్ చార్జ్, డ్రెస్‌కోడ్ పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. పరిశుభ్రత నిర్వహణలో శాస్త్రీయ, మెకనైజ్డ్ పద్ధతులు అవలంబించాలని, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దయాకర్‌రెడ్డి, రామారావు, ఏఈఓలు, సీఎస్ఓ, సంబంధిత పర్యవేక్షకులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కనగల్: కనగల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దళిత బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5వ తేదీన గణేష్ శోభాయాత్ర కొనసాగుతుండగా యువకుడు బాలిక ఇంటికి వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు, కుటుంబ సభ్యులు యువకుడిని బంధించే ప్రయత్నం చేశారు. అదే గ్రామానికి చెందిన యువకుడి స్నేహితులు ఇద్దరు అక్కడికి చేరుకొని బాధితురాలి తల్లిదండ్రుల నుంచి అతడిని తప్పించి అక్కడి నుంచి తీసుకెళ్లారు. బాలిక తల్లిదండ్రులు కనగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి బుధవారం అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో కేసు, అతడికి సహకరించిన ఇద్దరు వ్యక్తులపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఊట్కూరు వాగులో కొట్టుకుపోయిన వలస కూలీ

- రక్షించిన యువకులు



వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షిస్తున్న యువకులు

నిడమనూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిడమనూరు మండలంలోని ఊట్కూరు వాగులో ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. స్థానికంగా బొగ్గు బట్టీలో పనిచేసే వలస కూలీ మద్యం మత్తులో బుధవారం వాగులో పడి కొంత దూరం కొట్టుకపోయాడు. స్థానిక యువకులు అతడిని రక్షించారు.

ఎయిమ్స్‌లో ఆత్మహత్య నివారణ వారోత్సవాలు



ఆత్మహత్య నివారణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు, ఎయిమ్స్ సిబ్బంది

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆత్మహత్య నివారణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు, వారి బంధువులకు ఆత్మహత్య నివారణపై నర్సింగ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం ఓపీడీ బ్లాక్‌లో మానసిక ధైర్యం పెంపొందించుకునే విధంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్, డీన్ నితిన్ జాన్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ చేసిన నిందితులకు ఏడాది జైలు శిక్ష

నిడమనూరు: బైక్ చోరీ చేసిన నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. లైజన్ ఆఫీసర్ షేక్ అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన దేవనబోయిన కుప్పయ్య, వేముల నాగరాజు కలిసి నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం నేతాపురం గ్రామానికి చెందిన బసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బైక్‌ను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హాలియా పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితులు కుప్పయ్య, నాగరాజుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. అదనపు పీపీ సాధన వాదనలు వినిపించారు.

అనుమతి లేని క్లినిక్ సీజ్



వెలుగుపల్లిలో క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్యాధికారులు

తుంగతుర్తి: అనుమతులు లేకుండా నడిపిస్తున్న క్లినిక్‌ను సూర్యాపేట జిల్లా ఉప వైద్యాధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో సర్గం సంపత్‌కుమార్ ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీసంజీవని మెడికల్ అండ్ జనరల్ స్టోర్ నడిపిస్తున్నాడు. అంతేకాకుండా అందులో అనధికారికంగా రోగులకు చికిత్స కూడా చేస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో తనిఖీ చేసినట్లు సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓలు జయ మనోహరి, జి. చంద్రశేఖర్ తెలిపారు. సంపత్‌కుమార్ ఎలాంటి అర్హత లేకున్నా రోగులకు ఇంజెక్షన్లు, గ్లూకోజ్‌లు అందిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. వారి వెంట జిల్లా ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి నాజియా తబస్సుం, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ఆశ్రిత తదితరులు ఉన్నారు.

ఇంటికి చేరుకున్న హాస్టల్ విద్యార్థి



తండ్రితో శ్రీకాంత్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని నేతాజీ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ బాలుర హాస్టల్ నుంచి మంగళవారం అదృశ్యమైన విద్యార్థి తన ఇంటికి చేరుకున్నాడు. గద్వాల జిల్లా లతిపురం గ్రామానికి చెందిన విద్యార్థి గొల్లతిప్పడంపల్లి శ్రీకాంత్ మంగళవారం ఉదయం 9 గంటలకు హాస్టల్ నుంచి వెళ్లిపోయి కొత్తగూడెం వద్ద బస్సు ఎక్కి హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుండి రైలు ఎక్కి గద్వాలలో దిగి స్వగ్రామం లతిపురం చేరుకున్నాడు. శ్రీకాంత్ తండ్రి వెంటనే ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి తన కొడుకు ఇంటికి వచ్చిన విషయాన్ని చెప్పాడు. హాస్టల్‌లో ఉండలేక తల్లిదండ్రులను చూడాలని విద్యార్థి టీచర్లకు చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- చెవిదిద్దులు, రూ.20వేల నగదు, 15 చీరల అపహరణ

కోదాడరూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని భవానీనగర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్‌లో నివాసముండే వేనేపల్లి నాగేశ్వరరావు దంపతులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వారిద్దరు నడిగూడెంలో ఉంటూ వారంలో రెండు రోజులు కోదాడకు వచ్చి వెళ్తుంటారు. బుధవారం నాగేశ్వరరావు ఇంటికి పనిమనిషి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించింది. వెంటనే నాగేశ్వరరావుకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూడగా.. బీరువాలోని రెండు జతల చెవిదిద్దులు, కిడ్డీ బ్యాంకులో పిల్లలు దాచుకున్న రూ.20వేల నగదు, 15 చీరలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పట్టణ పోలీసులు తెలిపారు.

ఇంజన్‌లో మంటలు చెలరేగి ఆటో దగ్ధం



దగ్ధమవుతున్న ఆటో

చౌటుప్పల్ రూరల్: ఇంజన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఆటో దగ్ధమైంది. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అంబర్‌పేట్ నుంచి ఏపీలోని విజయవాడకు పేపర్ లోడ్‌తో ఆటో వెళ్తుండగా.. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్దకు రాగానే ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. డ్రైవర్ గమనించి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఆటో ఆపుతుండగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ పక్కన ఉన్న డోరు తెరుచుకోకపోవడంతో ఎడమ వైపు డోరు నుంచి డ్రైవర్ జడ నాగరాజు ఆటోలో నుంచి కిందకు దూకాడు. ఆటోలో పేపర్ లోడ్ ఉండడంతో చూస్తుండగానే ఆటో పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

రీజినల్ రింగ్ రోడ్డు మాకొద్దు

- గట్టుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



గట్టుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు


గట్టుప్పల్: రీజినల్ రింగ్ రోడ్డు తమకొద్దని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం గట్టుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట భూముల కోల్పోతున్న రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో రైతులు సారవంతమైన భూములు కోల్పోతున్నారని అన్నారు. భూములు కోల్పోతున్న వారికి భూమికి భూమి ఇవ్వాలని, ఓపెన్ వాల్యూయేషన్ మీద నాలుగు రెట్లు పెంచి ఇవ్వాలన్నారు. మహబూబ్‌నగర్, కల్వకుర్తి ప్రాంతాల్లో ఎకరానికి రూ.80 నుంచి రూ.90 లక్షల వరకు కొంతమంది రైతులకు ఇచ్చారని, మరికొందరికి రూ.కోటి వరకు కూడా ఇస్తున్నారని అన్నారు. నామాపురం, తేరట్‌పల్లి, వెల్మకన్నె రైతుల ఆమోదం లేకుండా అలైన్‌మెంట్ రూపొందించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ, సీపీఎం నాయకులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, అచ్చిన శ్రీనివాస్, పగిళ్ల శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు టి. శంకర్, ఇడెం కైలాసం, బాలం శ్రీను, అయితరాజు హనుమంతు, బండ లింగయ్య, పగిళ్ల నరసింహ, నల్లవెల్లి భిక్షం, పెద్దగాని నరసింహ, హనుమంతు, పగిళ్ల శంకర్, సాయిబాబా, శంకర్, హరి, నరేష్, చిననరసింహ పాల్గొన్నారు.

పంట మార్పిడితో లాభాల బాటలో..

- ప్రతి ఏడాది వేర్వేరు పంటలు సాగు చేస్తున్న తుర్కపల్లి మండలం నాగాయపల్లికి చెందిన రైతు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా ప్రణాళికలు



నాగాయపల్లిలో రైతు అంజయ్య సాగుచేస్తున్న బొప్పాయి తోట



తుర్కపల్లి: ఎప్పుడూ ఒకే రకం పంట సాగుచేసి నష్టాలపాలవ్వకుండా ప్రతి ఏడాది వేర్వేరు పంటలు సాగుచేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు తుర్కపల్లి మండలం నాగాయపల్లికి చెందిన రైతు లకావత్ అంజయ్య, ఆయన కుమారులు మంగ్యా, మోహన్. వారు అనుసరిస్తున్న పద్ధతి పలువురు రైతులకు ఆదర్శంగా మారింది. లకావత్ అంజయ్య కుటుంబ సభ్యులు గతంలో వరి సాగు చేసేవారు. అధిక పెట్టుబడి, నీటి వినియోగం, ఆరు నెలల నిరీక్షణ వంటి సమస్యలతో కూరగాయలు, పూలు, పండ్ల తోటల సాగు వైపు అడుగులు వేశారు. గతేడాది వంకాయ పంట వేసి మంచి లాభాలు పొందారు. ఈ ఏడాది బొప్పాయి సాగుపై దృష్టి సారించారు.

మూడు ఎకరాల్లో మూడు వేల మొక్కలు..

మిత్తం మూడు ఎకరాల్లో మూడు వేల బొప్పాయి మొక్కలు నాటారు. ఒక్కో మొక్కకు రూ.20 ఖర్చు కాగా.. దున్నకాలు, పేడ, ఎరువులు, డ్రిప్ సదుపాయం ఇతరత్రా కలసి మొత్తం రూ.2.5లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఎనిమిది నెలల్లోనే పండ్లు రావడం ప్రారంభమై.. సంవత్సరం పొడువునా దిగుబడి వస్తుంది. తెగుళ్ల నివారణ కోసం వారానికి ఒకసారి మందులు పిచికారీ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతేకాకుండా బొప్పాయి తోటలో అంతర పంటగా బంతి పూల సాగు కూడా చేపట్టారు. మొదటి కోతలోనే రెండు టన్నుల దిగుబడి వచ్చిందని, వారానికి ఒకసారి పూలు కోసి మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతు అంజయ్య, ఆయన కుమారులు పేర్కొన్నారు. పెట్టుబడి ఖర్చు రూ.2.5 లక్షలు కాగా.. ప్రకృతి అనుకూలించి, మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తే సుమారు రూ.6లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.